## క్లుప్తంగా

### డ్రైనేజీలు నిర్మించండి



మున్సిపల్ మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం ఇస్తున్న ఆదిత్యనగర్ కాలనీ వాసులు

**కర్నూలు (టౌన్):** నగరపాలక సంస్థ 27వ వార్డు ఆదిత్య నగర్‌లో డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు రాఘవేంద్ర, యాకుబ్, హుస్సేన్, కృష్ణ విన్నవించారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థలో మేనేజర్ చిన్నరాముడును కలిసిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ఖాళీ స్థలాలు ఉన్నాయని, వర్షం కురిసినప్పుడు అక్కడ వర్షపు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయన్నారు. అధికారుల స్పందించి తమ కాలనీలో పిచ్చి మొక్కలు తొలగించి డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని కోరారు.

### అద్దె బస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

**కర్నూలు(సెంట్రల్):** ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు వేతనాలుపెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం అద్దె బస్సు డ్రైవర్ల డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని అద్దె బస్సు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరెడ్డి, శ్రీనివాసులు, కార్యదర్శి భాస్కర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మార్చిలోనే ముగిసిందని, ఇంతవరకు వేతన సవరణ చేయలేదన్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న వేతనంతో డ్రైవర్ల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. వెంటనే వేతన సవరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసులు, యు.శ్రీనివాసులు, మద్దిలేటి, రాముడు, రామకృష్ణ, మనోహర్, గిడ్డయ్య, రాంబాబు, బాషా పాల్గొన్నారు.

### సారా కేసులో మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న నాటుసారా

**కర్నూలు:** కర్నూలు బంగారుపేట శివారులోని కేసీ కెనాల్ గట్టున ఉన్న నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేశారు. సారా విక్రయిస్తున్న బంగారుపేటకు చెందిన నీలిషికారి లక్ష్మిని అరెస్టు చేసి ఆమె వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, కర్నూలు సీఐ చంద్రహాస్, సుభాషిణి, ఎస్ఐ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

### కొత్తపేటలో తాగునీటికి కటకట

**కర్నూలు (టౌన్):** నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వాటర్ వర్క్స్ సిబ్బంది నెలన్నర రోజులుగా సమ్మెబాట పట్టారు. దీంతో నగరంలో తాగునీటి కష్టాలు అధికమయ్యాయి. వాటర్ వర్క్స్ యంత్రాంగం తాత్కాలికంగా చర్యలు తీసుకున్నా ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. స్థానిక కొత్తపేటలో మంచినీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా వచ్చే నీరు కలుషితమై బురదమయంగా ఉంటోందని స్థానిక మహిళలు వాపోయారు. బుధవారం కోత్తపేటలో పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు పర్యటించారు. సమస్యలను వారి దృష్టికి తీసుకు వచ్చారు. వారు మాట్లాడుతూ.. కాలనీలో తాగునీటిని సక్రమంగా సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

### విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**కోడుమూరు రూరల్:** గ్రామ సచివాలయ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి, కోడుమూరు, పులకుర్తి గ్రామాల్లో ఎంపీడీఓ రాముడుతో కలిసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, గ్రామాల పరిశుభ్రత, గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కోడుమూరులోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఈఓ గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రతి 250 ఇళ్లకు ఒక క్లాప్‌మిత్రను ఏర్పాటు చేయాలని ఈఓ అజయ్‌భాస్కర్‌ను ఆదేశించారు.అలాగే ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆషాఢం.. విశిష్టం

- ప్రారంభమైన ఆషాఢ మాసం
- పండుగలకు ప్రత్యేకం
- కొత్త జంటలకు నెల రోజుల విరహం



నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయం

**కర్నూలు కల్చరల్:** ఆషాఢ మాసం ఎంతో విశిష్టం .. ఏకాదశి, గురుపౌర్ణమి, చాతుర్మాస వ్రతాలు, పూరీలో జగన్నాథుని రథయాత్ర.. ఇలా ఎన్నో పండుగలు మరెన్నో ప్రత్యేకతలు దీని సొంతం. అయితే నవ దంపతులకు మాత్రం భారం.. కోటి ఆశలతో ఒక్కటైన జంటకు నెల రోజులపాటు ఎడబాటు తప్పదు. వారు మాత్రం శ్రావణం రావాలి అంటూ నిరీక్షిస్తుంటారు.

ఆషాఢ మాసం గురువారం ప్రారంభం కానుంది. ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. వివాహం లాంటి శుభకార్యాలు తలపెట్టరు. ఈ మాసంలో అనేక పర్వదినాలు ఉన్నాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి వైష్ణవ ఆరాధకులకు ముఖ్యమైంది. దీన్నే తొలి ఏకాదశి అంటారు. అప్పటినుంచి ప్రతి వారం ఏదో ఒక పండుగ, వ్రతం, పూజ ఉంటాయి. తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస వ్రతాన్ని ప్రారంభిస్తారు. వారాహి నవరాత్రి పూజలు ఆషాఢ మాసం తొలి రోజు నుంచే ప్రారంభమవుతాయి.

➤గోరింటాకు ప్రత్యేకం: ఆషాఢ మాసంలో యువతులు గోరింటాకు తప్పక పెట్టుకోవాలని పెద్దలు చెబుతుంటారు. గోరింటాకుకు మన సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది.

➤ఆషాఢ పౌర్ణమిని మనం వేద వ్యాసుని పేరిట గురుపౌర్ణమిగా నిర్వహింకుంటాం.

➤తెలంగాణలో బోనాల పండుగ నిర్వహిస్తారు. వర్షాల కారణంగా కూరగాయలు బాగా పండుతాయి. దుర్గామాతను శాకంబరీగా అలంకరించి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహిస్తారు.

➤ఒరిస్సాలోని పూరిలో జగన్నాథుని రథయాత్ర కూడా ఈ మాసంలోనే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

**వధూవరుల విరహం**

ఆషాఢ మాసంలో అత్తా కోడళ్లు ఒక ఇంటిలో ఉండకూడదంటారు. కొత్తగా పెళ్లయిన దంపతులను దూరంగా ఉంచుతారు. ఇందులో భాగంగా అమ్మాయిని పుట్టింటికి తీసుకెళతారు. ఇందులో శాస్త్రీయత ఉందని పెద్దలు పేర్కొంటారు. ఈ మాసంలో స్త్రీ నెల తప్పితే తొమ్మిది నెలల తర్వాత వేసవి కాలంలో ప్రసవించే అవకాశం ఉందని అప్పుడు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి శిశువుకు ఆ వాతావరణం ఇబ్బంది కలిగిస్తుందని, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తల్లీబిడ్డల ఆరోగ్యానికి కూడా ఈ వాతావరణం మంచిది కాదంటారు. అందుకే ఈ మాసంలో నూతన దంపతులను దూరంగా ఉంచుతారు.

**పెద్ద పండుగల రాకకు శుభసూచకం**



ఆషాఢాన్ని శూన్య మాసంగా భావిస్తారు. శుభ కార్యాలు చేయకూడదని విశ్వసిస్తారు. నిజానికి పెద్ద పండుగల రాకను ఈ మాసం తెలుపుతుంది. వైష్ణవులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రమైందిగా భావిస్తారు. మఠాధిపతులు ఈ మాసంలోనే చాతుర్మాస దీక్ష వహిస్తారు.

– అగ్రహారం రాఘవేంద్ర, పండితులు

## డ్రగ్స్‌తో జీవితాలు చిన్నాభిన్నం



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఈగల్ టీమ్, విద్యార్థులు

**కర్నూలు:** భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఈగల్ ఎస్ఐ సుజన్‌కుమార్ అన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడులోని క్రైడో స్కూల్‌లో బుధవారం ముక్త్ భారత్ అభ్యాన్, ఈగల్ క్లబ్స్ గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈగల్ ఎస్ఐ సుజన్‌కుమార్, ప్రిన్సిపల్ కార్తీక్ ముఖ్య అతిథులుగా హాజరై డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యంగా, చదువులో చురుగ్గా, జీవితంలో విజయవంతంగా ఉండాలంటే డ్రగ్స్ దరిచేరకుండా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం జరుగుతుంటే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

### నేడు కంటి అద్దాల పంపిణీ

**కర్నూలు (సెంట్రల్):** స్థానిక పాదుపు భవనంలో జూన్ 13న అమీలియో హాస్పిటల్ సౌజన్యంతో చేపట్టిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న జర్నలిస్టులకు గురువారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు సీనియర్ జర్నలిస్టు మీసాల రామస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ శంకర్‌శర్మ హాజరై కంటి అద్దాలను పంపిణీ చేస్తారని ఆయన వివరించారు.

### 27న రగ్బీ పోటీలు

**కర్నూలు (టౌన్):** నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో ఈ నెల 27వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ బాలబాలికల పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ జిల్లా సంఘం అధ్యక్షుడు గుడిపల్లె సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

### 30న మహాసభలు

**కర్నూలు(సెంట్రల్):** ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం మూడో నగర మహాసభలను జూన్ 30వ తేదీన హరికిషన్ సుర్జీత్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, ఎస్‌డీ ఖాజా పాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోలు 12, 14, 17లపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

### సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు (టౌన్):** డ్రైవింగ్ సమయంలో బ్లూటూత్, ఇయర్ ఫోన్లు వాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ద్విచక్ర వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ జి.సురేందర్ విన్నవించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలో రోజూ పదికి పైగా రోడ్డు ప్రమాదాలు సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయన్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ముఖ్య కూడళ్లలో తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ముందస్తు ప్రసవాలు ప్రమాదకరం



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రఘు

**కర్నూలు(హాస్పిటల్):** జాతకాల పిచ్చి, మూఢ నమ్మకాలతో ముందస్తు ప్రసవాలు చేయించుకోవడం ప్రమాదకరమని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. బుధవారం నగరంలోని అంబేడ్కర్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్త్రీకి మాతృత్వం దేవుడిచ్చిన వరమన్నారు. సాధారణ ప్రసవం తల్లీ బిడ్డ ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రస్తుతం ఆధునిక పోకడలతో కొంత మంది మూఢనమ్మకాలు, జాతకాల పేరిట ముహూర్తం చూసి ముందస్తు ప్రసవాలకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. తల్లీ బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసినా ఆపరేషన్లు చేయించుకుంటున్నారని చెప్పారు. తల్లి కడుపులో నవమాసాలు ఉండి సరైన ఎదుగుదలతో భూ ప్రపంచంలో అడుగు పెట్టాల్సిన శిశువులు అరకొర ఆరోగ్యంతోనే బయటకు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమంగా అటు తల్లికి, ఇటు శిశువుకు అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారి సుమధుర, ఆరోగ్య కార్యకర్త భీమేశ్వరి, ప్రాజెక్షనిస్టు ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

### హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం

**కర్నూలు(సెంట్రల్):** ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్ఏ సుభాన్, ఉపాధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ విమర్శించారు. బుధవారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఏమి సాధించిందని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. మసీదుల్లో పనిచేసే మౌజమ్‌లకు రూ.10 వేలు, ఇమామ్‌లకు రూ.5 వేలు ఇస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారన్నారు. మైనార్టీ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కోసం ఇస్తామన్న రుణాలు ఇవ్వలేదని చెప్పారు. ముస్లిం మహిళల వివాహాలకు ఇచ్చే ప్రోత్సాహకాలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ముస్లింలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయని కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని మండిపడ్డారు.

## టీకాతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

**కర్నూలు(హాస్పిటల్):** ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా టీకా రక్షణ కల్పిస్తుందని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న 56వ సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను మాతా శిశు సంరక్షణ కార్డులో సూచించిన తేదీ ప్రకారం క్రమం తప్పకుండా ఇప్పించాలని తల్లులకు సూచించారు. ఏ టీకా వేస్తున్నారు, ఆ టీకా ఏ జబ్బు రాకుండా నివారిస్తుంది అని తల్లులకు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యంగా 9వ, 16వ నెలలో మీజిల్స్ రుబెల్లా టీకా తప్పక వేయించాలని సూచించారు. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించి ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించాలన్నారు. ముఖ్యంగా తల్లులకు రక్తహీనత నివారణ కోసం ఆకుకూరలు, పండ్లు, బెల్లం, నువ్వులు, గుడ్లు వంటివి విరివిగా తినిపించాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు నిర్మలాబాయి, వైద్య సిబ్బంది అపర్ణ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

### పంచాయతీ నిధుల అవకతవకలపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

**ఓర్వకల్లు:** మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామ పంచాయతీలో వసూలైన పన్నులకు సంబంధించిన నిధుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం డీఎల్‌పీఓ లక్ష్మి విచారణ చేపట్టారు. గ్రామంలో దాదాపు 850 గృహాలు వుండగా, అందులో 150 ఇళ్లు కొత్తగా నిర్మించినట్లు గుర్తించారు. ఇందులో కేవలం 38 ఇళ్లకు మాత్రమే అప్రూవల్ ఇవ్వగా, మిగతా వాటికి ఏవిధమైన అప్రూవల్స్ ఇవ్వలేదని, గతంలో ఈఓఆర్‌డీగా వున్న పీవీ సుబ్బారాయుడు అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టాలని 2022లో గ్రామానికి చెందిన ఎం. రాంభూపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గ్రామంలోని సర్వే నంబర్ 124/9 లో వున్న ప్రభుత్వ భూమిలో(పోరంబోకు స్థలం) కోర్టులో విచారణ జరుగుతుండగా ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సుబ్బారాయుడు అక్రమంగా అనుమతులు ఇవ్వడమేగాక, కొళాయి కనెక్షన్ ఇచ్చినట్లు ఆరోపించారు. అంతేకాకుండా ఇంటి పన్ను, కుళాయిల డిపాజిట్ రశీదు పుస్తకాలు గల్లంతైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాలపై డీఎల్‌పీఓ లక్ష్మి విచారణ చేపట్టారు.

## సెక్యూరిటీ గార్డులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

**కర్నూలు(సెంట్రల్):** ప్రైవేట్ సంస్థల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులు తీవ్ర దుర్భరమైన జీవనాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను పస్తులు ఉంచుతున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వారికి కనీస వేతనంరూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పిస్తే వారి కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. ఈ విషయంపై లేబర్ శాఖ దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో బి.రాధాకృష్ణ, కృష్ణ, మద్దిలేటి, చంద్రబాబు పాల్గొన్నారు.

### కూడళ్ల ఏర్పాటుకు చర్యలు



విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద కూడలి కుదింపుపై చర్చిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

**కర్నూలు (టౌన్):** నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రధాన ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం కమిషనర్ మున్సిపల్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో కలిసి నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఆనంద్ థియేటర్ వద్ద కిసాన్ ఘాట్ నుంచి బంగారుపేటకు వెళ్లే రహదారి, కొత్తబస్టాండ్ సుందరయ్య కూడలి, వై.జంక్షన్ ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుతో పాటు గాయత్రీ ఎస్టేట్‌లోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద కూడలిని కుదించడం వంటి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డీఈఈ సాయిరాం, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## 'ఎమర్జెన్సీ కంటే ప్రమాదకరం మోదీ మత రాజకీయం'



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

**కర్నూలు (సెంట్రల్):** ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కంటే ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ మత రాజకీయం ప్రమాదకరంగా మారిందని సీపీఎం కేంద్ర మాజీ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అప్రజాస్వామికం రాజ్యమేలుతోందని, కులం, మతం, ప్రాంతీయ విభేదాలతో ప్రజలను రెచ్చగొట్టి మోదీ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఎమర్జెన్సీ నాడు–నేడు అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఏ గఫూర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తే ప్రజలు తిరగబడతారని, అది 1977లో కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా రుజువైందన్నారు. భారత దేశ విదేశాంగ విధానాన్ని మోదీ అమెరికాకు తాకట్టు పెట్టారని, అమెరికా అధ్యక్షుడు చెప్పినట్లు చేస్తున్నారని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. మరోవైపు నరేంద్ర మోదీ మాత్రం ప్రజాతంత్ర హక్కులు అంటూ గాంభీరాలు పలుకుతున్నారని విమర్శించారు. ప్రజలు చైతన్యవంతులై మేల్కొనకపోతే దేశ అస్థిరత్వం దెబ్బతినే ప్రమాదముందని చెప్పారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో దేశాన్ని బందీఖానాగా మార్చారని, హక్కులను కాలరాశారని, ప్రస్తుతం కూడా ఎమర్జెన్సీకి ఏమాత్రం తీసిపోని విధంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. మోదీ పాలనలో పౌరులు హక్కులన్నీ కోల్పోతున్నారని మతోన్మాదానికి వ్యతిరేకంగా గొంతు విప్పిన వారందరూ ఏదో విధంగా ఇబ్బందుల్లో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉంటే ఎన్ని నేరాలు, ఘోరాలు చేసినా బయటే ఉంచుతుందని, వ్యతిరేకంగా మాట్లాడితే జైలుకు పంపుతోందని విమర్శించారు. ఒకే భాష, ఒకే మతం, ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ రాష్ట్రాలకు ఉండే హక్కులను హరించివేస్తున్నారని, బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు, పౌర హక్కుల నేతలపై దాడులు పెరిగాయని, వారి ఆస్తులను బుల్‌డోజర్లతో ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. జులై 9న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, ఎం.డీ.ఆనంద్ బాబు, టి.రాముడు, ఎం.డీ.అంజిబాబు, కేవీ నారాయణ, నగర కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

## పొదుపు మహిళలకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

**కర్నూలు(సెంట్రల్):** పొదుపు గ్రూపుల్లోని మహిళలకు స్థానికంగా ఉపాధిని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం మెరిడియన్ ఫంక్షన్ హాలులో ఐద్వా, పట్టణ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి అలివేలు మాట్లాడుతూ.. పొదుపు సంఘాల్లోని మహిళలు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళలను ఓబీలు, ఆర్‌పీలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. మహిళా సంఘం అధ్యక్షురాలు కె.అరుణ, సీఎంఎం భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

### డ్రోన్ కెమెరా వితరణ



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు డ్రోన్ కెమెరాను అందజేస్తున్న డి.వెంకటేశ్వరరెడ్డి

**కర్నూలు:** నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు జిల్లా పోలీసులు తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ డీవీఆర్ సిటీ డిజిటల్ అధినేత డి.వెంకటేశ్వరరెడ్డి తన వంతు సహాయంగా డీజే డ్రోన్ కెమెరాను ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు అందజేశారు. డీవీఆర్ సిటీ డిజిటల్ జనరల్ మేనేజర్ ఎస్‌కే మహేష్, మాజీ కార్పొరేటర్ సురేంద్రతో పాటు డీఎస్పీ బాబుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ కోరారు.

## పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

**కర్నూలు(సెంట్రల్):** ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఓల్డ్ సిటీ కమిటీ మూడో నగర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలులో ఎంతో మంది నిరుద్యోగులు ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారిపై పోలీసులు, ఆర్‌టీఏ అధికారులు దాడులు చేయడం తగదన్నారు. వివిధ చలాన్ల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. అనంతరం ముఖ్యఅతిథులుగా హాజరైన ఆర్‌టీఓ భరత్ చౌహాన్, ఎంవీఐ రవీంద్రకుమార్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ట్రాఫిక్ నిర్వహణపై సలహాలు, సూచనలు చేశారు. నగరంలో ఏడుచోట్ల ఆటోమేషన్ సీసీ కెమెరాలను అమర్చారని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడుపుకోవాలన్నారు. కిమ్స్ ఆసుపత్రి సీఈఓ సునీల్‌కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు జానకీ రామయ్య ఆటో డ్రైవర్ల ఆరోగ్యంపై మార్గదర్శకం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.కుమార్, కార్యదర్శిగా మహ్మద్‌ను ఎన్నుకున్నారు.

## సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న పోలీసు అధికారులు, వైద్యులు

**కర్నూలు:** అత్యవసర పరిస్థితుల్లో ముందుండే పోలీసు సిబ్బందికి సీపీఆర్, ప్రథమ చికిత్సపై జిల్లా పోలీసు కార్యాలయంలో వైద్యులచే శిక్షణ (అవగాహన కార్యక్రమం) నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బుధవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుండెపోటు వచ్చినప్పుడు, స్పృహ కోల్పోయినప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్లే గంటలోపు చేసే సీపీఆర్ విధానాన్ని పోలీసుల చేత ప్రాక్టీస్ చేయించారు. మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రతిభ కనపరచిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు లేదా గుండెపోటు వచ్చినప్పుడు కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రూ.8 వేలు విలువ గల హెల్త్ చెకప్ కూపన్లను పోలీసులకు రూ.వెయ్యికి అందజేశారు. హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్‌కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డీఎస్పీలు బాబుప్రసాద్, భాస్కర్ రావు, ప్రసాద్, సీఐలు, ఆర్ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఇళ్ల పట్టాల పేరుతో మోసం



మాట్లాడుతున్న సందేల్ చంద్రశేఖర్

**కర్నూలు(అర్బన్):** నగరంలోని మాధవీనగర్‌కు చెందిన కొందరు నాయకులు ఒక గ్రూపుగా ఏర్పడి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నట్లు చెబుతూ బ్రాహ్మణులను మోసం చేస్తున్నారని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ప్లాట్లు వేసి పాణ్యం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలను ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే నకిలీ నాయకులు నగరంలోని పేద బ్రాహ్మణుల నుంచి రూ.15 వేలు చొప్పున వసూలు చేసి నకిలీ పట్టాలు పంపిణీ చేశారన్నారు. జరిగిన మోసాలపై తగిన ఆధారాలతో జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సంఘం నాయకులు చెరువు వెంకటదుర్గాప్రసాద్, కంచుగంటల శ్యాంసుందర్ రావు, నాగవరం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓ ప్రకటనలు మాని చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వై.నగేష్

**కర్నూలు(సెంట్రల్):** జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి వ్యవహరిస్తున్నా చర్యలు తీసుకోవడంలో డీఈఓ విఫలమయ్యారని, కేవలం ప్రకటనలకు పరిమితం కావడంతో ఆయా యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ మండిపడ్డారు. బుధవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఏ పాఠశాలలో చూసినా పుస్తకాల వ్యాపారం, అధిక ఫీజులు వసూలు చేయడం, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకున్నా డీఈఓ ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరిస్తున్నా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు చెవిన ఎక్కించుకోవడం లేదన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.